"బ్రాహ్మణులు అనగా ధర్మ సత్తా మరియు స్వరాజ్య సత్తా యొక్క అధికారీ ఆత్మలు"

ఈ రోజు బాప్ దాదా నలువైపులా ఉన్న పిల్లలలో రెండు విశేష సత్తాలను చూస్తున్నారు. ఆ రెండు సత్తాలు ఏమిటంటే - ఒకటి ధర్మ సత్తా మరియు రెండవది స్వరాజ్య సత్తా. బ్రాహ్మణ జీవితం యొక్క విశేషత ఏమిటంటే - ఈ రెండు సత్తాలు ప్రతి ఒక్కరికీ ప్రాప్తిస్తాయి. ధర్మ సత్తా అనగా సత్యత, పవిత్రత యొక్క ధారణా స్వరూపము మరియు స్వరాజ్య సత్తా అనగా అధికారులుగా అయ్యి సర్వ కర్మేంద్రియాలను తమ అధికారంతో ఆజ్ఞానుసారంగా నడిపించడము. స్వరాజ్య అధికారులు లేక స్వరాజ్య సత్తా యొక్క అధికారులు ఏ విధమైన పరిస్థితి, ప్రకృతి లేక మాయ యొక్క సర్వ స్వరూపాలలో ఆధీనులుగా అవ్వరు, అధికారులుగా ఉంటారు. ప్రతి బ్రాహ్మణ ఆత్మకు బాప్ దాదా ఈ రెండు సత్తాలను ప్రాప్తింపజేసారు కదా? అందరిలోనూ ఈ రెండు సత్తాలు ఉన్నాయా లేక ఇంకా పూర్తిగా లేవా? ఇప్పుడు ఈ రెండు సత్తాలనూ ప్రాప్తి చేసుకునేవారే భవిష్యత్తులో ధర్మ సత్తా మరియు రాజ్య సత్తాకు అధికారులుగా అవుతారు. రెండు సత్తాలను ధారణ చేసారా? మీ చిత్రాన్ని చూసారా? ఇది డబుల్ విదేశీయుల చిత్రమా లేక ఇతరుల చిత్రమా? మరి ఈ చిత్రంలో రెండు సత్తాల గుర్తులను చూసారా? ధర్మ సత్తాకు గుర్తు ప్రకాశ కిరీటము మరియు రాజ్య సత్తాకు గుర్తు రత్న జడిత కిరీటము. మరి మీ ఈ చిత్రాన్ని చూసారా? రెండు సత్తాలను ఈ సమయంలోనే ధారణ చేస్తారు. అర్ధకల్పము రెండు సత్తాలు కేవలం మీ అందరి చేతిలో, ఒకే చేతిలో ఉండేవి. ద్వాపరం నుండి చూస్తే ధర్మ సత్తా వేరైపోయింది మరియు రాజ్య సత్తా వేరైపోయింది, అందుకే ధర్మ పితలు రావలసి వచ్చింది. కావున ధర్మ పితలు మరియు రాజులు ఇరువురూ వేర్వేరుగా అయిపోయారు. కానీ మీ రాజ్యంలో వేర్వేరుగా ఉంటారా? ప్రతి ఒక్కరి వద్ద రెండు సత్తాలు కలిపి ఉంటాయి, అందుకే అఖండమైన, నిర్విఘ్నమైన రాజ్యం కొనసాగుతుంది. కావున ప్రతి ఒక్కరిలోనూ ఈ రెండు సత్తాలను చూస్తున్నారు - ప్రతి ఒక్కరూ ఎంతవరకు తమలో ధారణ చేసారు? ఎంతవరకు అధికారులుగా అయ్యారు? సదా అధికారులుగా ఉంటున్నారా లేక అప్పుడప్పుడు ఆధీనులుగా, అప్పుడప్పుడు అధికారులుగా ఉంటున్నారా? ఇప్పుడిప్పుడే అధికారులుగా ఉంటూ మళ్ళీ ఇప్పుడిప్పుడే ఆధీనులుగా అయిపోతే మంచిగా అనిపిస్తుందా? లేక సదా అధికారులుగా ఉంటే మంచిగా అనిపిస్తుందా? సదా అధికారం కావాలా లేక కొద్ది సమయం కోసమైనా సరిపోతుందా? స్వయంగా తండ్రి అధికారాన్ని ఇస్తున్నప్పుడు, ఇచ్చేవారు ఇస్తున్నప్పుడు, తీసుకునేవారు ఏం చేయాలి? తీసుకోవడం సులభమా లేక ఇవ్వడం సులభమా? తీసుకోవడంలో కష్టమేమీ లేదు కదా? ఇచ్చేటప్పుడు ఆలోచిస్తారు - ఇవ్వాలా, ఇవ్వవద్దా, తక్కువ ఇవ్వాలా, ఎక్కువ ఇవ్వాలా... కానీ తీసుకోవడంలో అందరూ - ఎంత లభిస్తే అంత తీసేసుకోవాలి అని అంటారు. మరి తీసుకోవడంలో నంబరు వన్ గా ఉన్నారా, నంబరు టూ గా ఉన్నారా? ఇందులోనైతే ఎవ్వరూ నంబరు టూ గా అవ్వరు. మరి ఇవ్వాల్సి వచ్చినప్పుడు... ఇవ్వడంలో కూడా నంబరు వన్ గా ఉన్నారా లేక ఆలోచించవలసి వస్తుందా, ధైర్యం పెట్టవలసి వస్తుందా! వాస్తవానికి ఏమి ఇస్తున్నారో చూడండి? బ్రాహ్మణ జీవితంలో ఇవ్వడం ఉందా లేక తీసుకోవడం ఉందా? ఒకవేళ ఇచ్చే వస్తువు కన్నా తీసుకునే వస్తువు శ్రేష్ఠంగా ఉన్నట్లయితే, అది తీసుకోవడం అయినట్లా లేక ఇవ్వడం అయినట్లా? ఇవ్వాల్సి ఉంటుంది, ఇవ్వాలి - ఇలా ఆలోచిస్తే భారీగా అయిపోతారు. తీసుకోవాలి - అని అనుకుంటే సదా సంతోషంగా ఉంటారు, ధైర్యంగా ఉంటారు. ఇచ్చే విషయంలో ఇవ్వడము కష్టమని అనుకుంటారు. కానీ మీరు మొదట తీసుకుంటారు, ఆ తర్వాత ఇవ్వడమైతే ఏమీ ఇవ్వరు. బాబాకు ఇవ్వడానికి మీ వద్ద ఏమైనా ఉందా? ఇచ్చేటప్పుడు మంచి వస్తువును ఇస్తారా లేక పాడైన వస్తువును ఇస్తారా? మరి మీ వద్ద మంచిది ఏముంది - తనువు మంచిది ఉందా? మనస్సు మంచిది ఉందా? ధనము మంచిది ఉందా? అన్నీ పనికిరానివిగానే ఉన్నాయి. మందులతో శరీరాన్ని ముందుకు తోస్తున్నారు, అలా తోస్తూ నడిపే బండి ఏమైనా మంచిగా ఉంటుందా! కావున బ్రాహ్మణ జీవితంలో తీసుకోవడమే తీసుకోవడము మరియు పిల్లలు తండ్రి కన్నా తెలివైనవారు అని తండ్రి నవ్వుకుంటూ ఉంటారు. మొదట తీసేసుకుంటారు, ఆ తర్వాత ఇవ్వడము గురించి ఆలోచిస్తారు. తెలివైనవారే కదా! మంచిది, పిల్లలు తెలివైనవారు అయితే తండ్రికి మంచిగానే అనిపిస్తుంది కానీ నడుస్తూ-నడుస్తూ ఒకవేళ డల్ గా అయిపోతే మంచిగా అనిపించదు. అప్పుడప్పుడు పిల్లల ముఖం ఎలా అయిపోతుందంటే, ఏమైందో అర్థం కాదు! ఏ విధంగానైతే శరీరంలో నడుస్తూ-నడుస్తూ ఉండగా రక్తం తక్కువైపోతే బలహీనంగా అయిపోతారు కదా, ముఖంలో కూడా ఆ బలహీనత కనిపిస్తుంది. అలాగే ఇక్కడ కూడా సంతోషం యొక్క, శక్తుల యొక్క లోటు ఏర్పడుతుంది కదా, అప్పుడు ముఖం ఎలా అయిపోతుందంటే... అందరికీ తెలుసు, అందరూ అనుభవజ్ఞులే. ఒకవైపేమో సంతోషాల గని

లభించింది, అది కూడా అవినాశీగా లభించింది అని అంటారు, మరి అది ఎలా తగ్గిపోతుంది? మరి తండ్రి వద్ద మీ రోజంతటి మనస్సు యొక్క మూడ్ మరియు ఆ మూడ్ అనుసారంగా ముఖ కవళికలు ఏవైతే మారిపోతాయో, ఆ రోజంతటి చిత్రాలు వారి వద్ద ఉంటాయి. మీరు చిత్రాలతో మ్యూజియం తయారుచేస్తారు కదా, తండ్రి వద్ద మీ చిత్రాల మ్యూజియం ఉంటుంది. కావున బ్రాహ్మణ ఆత్మనైన నేను రాజ్య సత్తా మరియు ధర్మ సత్తా యొక్క అధికారీ ఆత్మను అన్నది సదా గుర్తుంచుకోండి. ఈ స్మృతి యొక్క నిశ్చయము ఉన్నట్లయితే నషా ఉంటుంది, నిశ్చయం తక్కువగా ఉంటే నషా కూడా తక్కువగా ఉంటుంది. కావున చెక్ చేసుకోండి - ఈ సత్తాలు సదా తోడుగా ఉంటాయా లేక అప్పుడప్పుడు ఉంటున్నాయి మరియు అప్పుడప్పుడు పోగొట్టుకుంటున్నారా?

అచ్చా, ఈ రోజు డబుల్ విదేశీయులు మెజారిటీ ఉన్నారు. బాప్ దాదా విశేషంగా డబుల్ విదేశీయులను అడుగుతున్నారు - రోజంతటిలో మీ అధికారం యొక్క సీటుపై సెట్ అయి ఉంటున్నారా లేక చాలా త్వరగా అప్సెట్ (డిస్టర్బ్) అవుతున్నారా? లేక అప్సెట్ అవ్వడము అనేది గతంలోని విషయము, ఇప్పుడు అలా అవ్వటం లేదు. గతానికి సంబంధించిన విషయమైంది కదా! ఇప్పుడైతే అలా అవ్వడం లేదు కదా! ఇప్పుడు నాలెడ్జ్ ఫుల్ గా, పవర్ ఫుల్ గా అయిపోయారు. చిన్న విషయానికే అప్సెట్ అయిపోవడం, ముఖం మారిపోవడం, మూడ్ మారిపోవడం, అలా ఉండకూడదు! అలా అప్పుడప్పుడు అవుతూ ఉందా? అప్పుడప్పుడు అప్సెట్ అవుతున్నారా? అచ్చా! అప్సెట్ అవ్వడం అంటే ఏమిటో కూడా మర్చిపోయాము అని భావించే శక్తిశాలి ఆత్మలు ఎవరైతే ఎప్పుడూ అప్సెట్ అవ్వరో వారు చేతులెత్తండి. మీరు నిజం చెప్తున్నారు, అందుకు అభినందనలు. ఇప్పుడు ఈ సీజన్ లో ఏదో ఒకటి మధుబన్ లో వదిలేసి వెళ్తారా లేక ఏదైనా తీసుకొని వెళ్తారా? మెజారిటీ మధుబన్ లో శివరాత్రిని జరుపుకున్నారు కదా! ఎవరి బర్త్ డే అయితే జరుపుకుంటారో వారికి గిఫ్ట్ ఇస్తారు కదా. మరి బాబాకు ఏం గిఫ్ట్ ఇచ్చారు? ఈ అప్సెట్ అవ్వడము అన్నదానినే గిఫ్ట్ గా ఇవ్వండి - మేమెప్పుడూ అప్సెట్ అవ్వము. ధైర్యముందా? అచ్చా, చేతులెత్తండి మరియు టి.వి.లో అందరి చేతులను ఫోటో తీయండి. ఆలోచించి, అర్థం చేసుకుని పక్కాగా చేతులెత్తండి. చూడండి, అందరి చేతులది ఫోటో తీసారు. ఇప్పుడు ఫోటో తీసేసారు చూసుకోండి. బాప్ దాదాకు ఆ ముఖం మంచిగా అనిపించదు. బాప్ దాదా పిల్లలు ప్రతి ఒక్కరినీ సదా వికసించి ఉన్న ఆత్మిక గులాబీలుగా చూడాలనుకుంటారు. వాడిపోయినట్లు కాదు, వికసించి ఉండాలి. ఎవరి పట్లనైతే ప్రేమ ఉంటుందో, వారికి ఏది మంచిగా అనిపిస్తుందో, అదే చేయడం జరుగుతుంది! డబుల్ విదేశీయులైతే బాబాను ఎంతగానో ప్రేమిస్తారు. కావున బాబాకు ఏదైతే మంచిగా అనిపిస్తుందో అదే మీకు మంచిగా అనిపిస్తుంది కదా! ఇప్పుడు ఇక ఎవ్వరి నుండి ఇటువంటి సమాచారం రాకూడదు - ఏం చేయాలి, విషయమే అలా ఉంది, అందుకే అప్సెట్ అయ్యాము! ఒకవేళ అప్సెట్ చేసే విషయం వచ్చినా కానీ మీరు అప్సెట్ స్థితిలోకి రాకండి. ఏ విధంగా అయితే ఊయల ఊగుతారు కదా, అప్పుడది పైకీ-కిందికీ ఊగుతుంది, చాలా కిందకు వచ్చినా, చాలా పైకి వెళ్ళినా, చాలా ఫాస్ట్ గా ఊగినా, అది శరీరాన్ని అప్సెట్ చేస్తుంది కదా, అప్పుడు మీరేమైనా అప్సెట్ అవుతారా? ఎందుకవ్వరు? దానిని ఆటగా భావిస్తారు కావున అప్సెట్ అయ్యేందుకు బదులుగా మనోరంజనంగా భావిస్తారు. కారణమేమిటి? అది ఒక ఆట. అలా ఒకవేళ ఏమైనా అప్సెట్ చేసే విషయాలు వచ్చినా కానీ, తప్పకుండా వస్తాయి కూడా, ఎవరైతే చేతులు ఎత్తారో వారి వద్దకు ఇంకా పెద్ద అప్సెట్ చేసే విషయాలు వస్తాయి ఎందుకంటే మాయ కూడా మురళి వింటుంది. కానీ దానిని ఒక ఆటగా భావించండి, భయపడకండి. అచ్చా, అది ఊపుతుంది, ఊపనివ్వండి. కానీ మనసు భయపడకూడదు. నాలెడ్జ్ ఫుల్ గా, పవర్ ఫుల్ గా అవ్వండి. ఆ సీట్ ను వదలకండి. ఒకవేళ మీరు అప్సెట్ అయ్యేవారు కాదు అని మాయ ఒకటి, రెండు సార్లు గమనించినా కూడా, అది స్వయం అప్సెట్ అవుతుంది, మిమ్మల్ని అప్సెట్ చేయదు. విషయం గురించి చర్చించడమైతే చేయండి, ఏదైనా విషయం వచ్చినప్పుడు నాలెడ్జ్ ఫుల్ గా ఉన్న కారణంగా - ఇది కరక్ట్, ఇది కరక్ట్ కాదు, ఇది జరగాలి, ఇది జరగకూడదు... అని అర్థమవుతుంది కదా. కానీ విషయం గురించి చర్చించేటప్పుడు దానిని ఒక విషయంలా చర్చించండి, అంతేకానీ అప్సెట్ అవుతూ కాదు. ఒక వైపు చెప్తూ ఉంటారు, ఇంకొక వైపు గంగ, యమునలు ప్రవహిస్తూ ఉంటాయి. మనస్సులో ప్రవహించినా లేక కళ్ళ నుండి ప్రవహించినా, రెండూ కరక్ట్ కాదు. మరి గిఫ్ట్ ఇవ్వడానికి రెడీగా ఉన్నారా? ఆలోచించి చెప్పారా లేక ఊరికే అవును అని చెప్పేసారా?

బాప్ దాదా చాలా సహజమైన పదాలతో యుక్తిని తెలియజేస్తున్నారు. ఎప్పుడైనా, ఏ పరిస్థితి అయినా లేక ప్రకృతి అయినా అలజడి రూపంలో వస్తే రెండు పదాలను గుర్తుంచుకోండి. దీనికి విధి ఏమిటంటే - అయితే 'నాట్' (వద్దు) అని అనండి లేక 'డాట్' (బిందువు) పెట్టండి. నాట్ లేక డాట్. ఒకవేళ ఏదైనా విషయం తప్పుగా ఉన్నట్లయితే 'నాట్' అనగా చేయకూడదు అని భావించండి. ఆలోచించకూడదు, చేయకూడదు, మాట్లాడకూడదు. మరియు బిందువు

పెట్టినట్లయితే అది నాట్ అన్నట్లు అవుతుంది. వద్దు అని భావించండి, బిందువు పెట్టండి, ఫినిష్. బిందువు పెట్టడానికి ఎంత సమయం పడుతుంది? ఒక్క క్షణం కన్నా తక్కువ సమయము. కానీ జరిగేదేమిటి? ఇది చేయకూడదు, ఇది సరి కాదు అని భావిస్తారు కానీ బిందువు పెట్టడం రాదు. నాలెడ్జ్ ఫుల్ గా అయితే అయ్యారు కానీ కేవలం నాలెడ్జ్ ఫుల్ గా ఉంటే సరిపోదు, నాలెడ్జ్ ఉండడంతో పాటు పవర్ ఫుల్ గా కూడా ఉండాలి. పవర్ ఫుల్ స్థితి యొక్క లోటు ఉంది, అందుకే బిందువు పెట్టలేకపోతారు. మరియు ఎవరికైతే బిందువు పెట్టడం వస్తుందో, వారు బాబాను కూడా మర్చిపోరు ఎందుకంటే బాబా కూడా బిందువు. మీరు కూడా బిందువే కదా. కావున అన్నీ గుర్తుకు వచ్చేస్తాయి. ఫుల్ స్టాప్. ప్రశ్నార్థకము (?), ఆశ్చర్యార్థకము (!) లేక కామా (,)... ఇవి పెట్టకండి. ఫుల్ స్టాప్ (.). ఫుల్ స్టాప్ గుర్తు సహజం కదా. మిగిలినవన్నీ కష్టమే. అన్నింటికన్నా కష్టమైనది ప్రశ్నార్థకం. అది పెట్టడం చాలా త్వరగా వస్తుంది. వై (ఎందుకు) అన్న పదం వచ్చినప్పుడు ఏం చేయాలో వినిపించాము కదా? ఫ్లై. పైకి ఎగిరిపోండి. వై కాదు ఫ్లై. ఎగిరిపోవడం వస్తుందా?

డబుల్ విదేశీయులలో మంచి-మంచి రత్నాలు వెలువడ్డారు. బాప్ దాదా ఇటువంటి రత్నాలను చూసి హర్షిస్తారు. అలాగే ఇటువంటి రత్నాలెవరైతే చాలా అమూల్యంగా ఉన్నారో ఇటువంటి అమూల్య రత్నాలలో చాలా చిన్న మచ్చ అయినా ఎక్కడైనా కనిపిస్తే ఆ అమూల్య రత్నాల ముందు ఆ మచ్చ మంచిగా అనిపించదు. చూడడానికి చిన్న మచ్చే కానీ దానిని మచ్చ అనే అంటారు కదా! మరి అమూల్య రత్నాలుగా అయినప్పుడు ఆ చిన్న మచ్చను ఎందుకు ఉంచుకున్నారు? మంచిగా అనిపిస్తుందా? చంద్రుడిలో కూడా నల్లని మచ్చ కనిపిస్తుంది కదా, అందుకే అది మంచిదేలే అని అయితే అనుకోవడం లేదు కదా! డబుల్ విదేశీయులు శ్యాంపుల్ గా అయి చూపించండి. కొద్దిగా కూడా ఎటువంటి లోపము ఉండకూడదు. మామూలుగా కూడా మచ్చకు కారణం ఏమిటి? మచ్చ అంటుకోవాలి అని అనుకోరు కానీ అంటుకుంటుంది. ఎందుకు అంటుకుంటుంది? మూల కారణం తెలుసా? తెలుసుకోవడంలోనైతే తెలివైనవారు. అది మీకు తెలుసు కూడా మరియు పరస్పరంలో వర్క్ షాప్ చేసుకున్నప్పుడు బాప్ దాదా ఆ వర్క్ షాప్ ఫోటోను కూడా చూస్తారు. ఇది కారణము, అది కారణము... అంటూ ఎన్నో కారణాలను తీస్తారు. మంచి-మంచి విషయాలను వర్క్ షాప్ లో తీస్తారు కానీ వాటిని వర్క్ లోకి తీసుకురారు. దేహాభిమానము ఎన్నో సూక్ష్మరూపాలలో వస్తూ ఉంది. ఇప్పుడు దేహాభిమానము స్థూలరూపంలో రావటం లేదు కానీ సూక్ష్మమైన మరియు రాయల్ రూపంలో వస్తుంది. బుద్ధిని చాలా బాగా నడిపిస్తారు. మంచి-మంచి విషయాలను ఆలోచించినప్పుడు బాప్ దాదా సంతోషిస్తారు కానీ మంచి విషయాలను ఆలోచిస్తూ-ఆలోచిస్తూ ఉండగా ఎవరైనా కొద్దిగా ఏదైనా ఎడిషన్, కరెక్షన్ చేస్తే నేను అనేది వచ్చేస్తుంది. ఏ విధంగా మీ అభిప్రాయాలను సంతోషంగా ఇస్తారో, అలాగే ఇతరుల అభిప్రాయాలను కూడా సంతోషంగా తీసుకోండి. ఇది ఎలా అవుతుంది, ఇలా చేసారేమిటి, ఇలా జరిగే అవకాశమే లేదు, ఇది నడవదు... అంటూ గాభరా పడకండి. మీ విషయాలకు ఎంత గౌరవం ఇస్తారో, ఇతరుల సలహాలకు, ఇతరుల విషయాలకు కూడా అంతే గౌరవం ఇవ్వండి. అభిప్రాయం చెప్పడం వేరే విషయము. వారి అభిప్రాయాలు మీకు కరక్ట్ గా అనిపించకపోయినా వాటి ప్రభావంలోకి వస్తే, అవస్థ కింద-మీద అయితే, ఆ సేవ సేవ కాదు. ఎడ్జస్ట్ అవ్వడము, ఇతరుల అభిప్రాయాలను కూడా తమ అభిప్రాయాల మాదిరిగానే ఆలోచించడము, అర్థం చేసుకోవడము చేస్తే - ఇదే ఇతరుల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడము. నేను ఇది ఆలోచించాను లేక ఈ ఐడియా తీసాను, ఈ విధంగా ఆలోచించాను, పని చేసాను కావున నా అభిప్రాయాలకు ప్రాముఖ్యత ఇవ్వాలి, ఇతరులు గౌరవించాలి అని భావిస్తారు కదా, అలాగే ఇతరుల అభిప్రాయాలను తమ అభిప్రాయాలతో కలుపుకోవాలి, అలా చేయడం రావటం లేదు. ఇతరుల అభిప్రాయాలను ఇతరుల అభిప్రాయాలు అనే భావిస్తున్నారు. ఇప్పుడు డబుల్ విదేశీయులు కూడా సేవా క్షేత్రంలో ప్లాన్ తయారుచేయడంలో మంచిగా ప్రోగ్రెస్ అవుతున్నారు. ఇంకా ముందు-ముందు కూడా అవ్వనున్నారు. కానీ ఎడ్జస్ట్మెంట్ యొక్క విశేషతను ఉపయోగించండి. ఒకవేళ ఏ బిడ్డ అయినా ముందుకు వెళ్తే బాప్ దాదాకు ఎంతో సంతోషం కలుగుతుంది. అంతేకానీ వీరు ఎందుకు ముందుకు వెళ్ళారు అని ఆలోచించరు. ఎవరు ముందుకు వెళ్ళినా చాలా మంచిది. డబుల్ విదేశీయుల పట్ల బాప్ దాదాకు స్నేహమైతే ఉంది కానీ సేవ యొక్క ప్లాను లేక ప్రాక్టికల్ సేవ కొరకు ఏదైతే చేస్తారో, చేస్తున్నారో దాని కొరకు చాలా-చాలా గౌరవముంది.

బాప్ దాదా ఇంతకుముందు కూడా వినిపించారు - ఒకవేళ డబల్ విదేశీయులైన మీరు లేకపోతే బాబా యొక్క ఒక టైటిల్ ప్రాక్టికల్ లో నిరూపించబడదు. అది ఏమిటి? విశ్వ కళ్యాణకారి. ఇప్పుడు చూడండి, విశ్వంలో నలువైపులా బాబా సందేశాన్ని ఇస్తున్నారు కదా! ఈ సీజన్ లో నలువైపుల నుండి వచ్చారు కదా! మొత్తం ఎన్ని దేశాల వారు వచ్చారు? (58). ఇంకా ఎన్ని ముఖ్యమైన దేశాలు ఉన్నాయి? (125). చిన్న-చిన్న దేశాలైతే ఎన్నో ఉంటాయి కానీ ముఖ్యమైన దేశాలు ఇంకా 125 మిగిలి ఉన్నాయి! మరి ఇప్పుడు డబుల్ విదేశీయులు ఇంకా ఎంతో పనిచేయవలసి ఉంటుంది.

భారత్ లోనూ చేయాలి మరియు విదేశాలలోనూ చేయాలి, రెండు చోట్లా చేయాలి. బాప్ దాదా ఇంతకుముందు కూడా వినిపించారు - సేవ యొక్క సంపూర్ణ సఫలతకు గుర్తు ఏమిటంటే మా వైపు సందేశము చేరుకోలేదు అని ఎటువైపు నుండీ ఏ ఆత్మా ఫిర్యాదు చేయకూడదు. సందేశాన్ని చేర్చిన తర్వాత, ఎవరైనా అది విని కూడా తమ భాగ్యాన్ని తయారుచేసుకోకపోతే ఆ ఫిర్యాదు మీకు వర్తించదు, అది ఆ ఆత్మలకు సంబంధించినదే. కానీ మీ పట్ల ఎటువంటి ఫిర్యాదు ఉండకూడదు. మాస్టర్ విశ్వ కళ్యాణకారులు అని అన్నప్పుడు విశ్వం నలువైపులకు సందేశమైతే చేరుకోవాలి. భారత్ లో కూడా చేరుకోవాలి, అలాగే విదేశాలలో కూడా చేరుకోవాలి. ఏ సమయంలోనైతే మీ విజయం యొక్క జెండాను ఎగురవేస్తారో, ఆ సమయంలో ఏ ఆత్మ అయినా వచ్చి ఈ ఫిర్యాదు చేస్తే, మంచిగా అనిపిస్తుందా? ఒక వైపు మీరు జెండాను ఎగురవేస్తున్నారు మరియు ఇంకొక వైపు వ్యక్తులు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు అంటే మంచిగా అనిపిస్తుందా? అనిపించదు కదా! డబుల్ విదేశీయుల ధైర్యము బాగుంది, బాబా పట్ల ప్రేమ అయితే ఉండనే ఉంది కానీ సేవ పట్ల ప్రేమ కూడా బాగుంది. రెండింటి పట్ల ప్రేమ యొక్క సర్టిఫికెట్ బాగుంది. ఇప్పుడు ఏ సర్టిఫికెట్ ను తీసుకోవాలి? ఎంత సేవాధారులో అంతే శక్తిధారులు. కావున శక్తిస్వరూపులుగా అయిపోయారు - అన్న ఈ సర్టిఫికెట్ ను తీసుకోవాలి. బాప్ దాదా చూసారు - మెజారిటీ బాబా పట్ల మరియు సేవ పట్ల ప్రేమ ఉండడంలో పాస్ అయ్యారు అచ్ఛా.

నలువైపులా ఉన్న ధర్మ సత్తా యొక్క అధికారీ ఆత్మలకు, సదా స్వరాజ్య సత్తా యొక్క అధికారీ ఆత్మలకు, సదా డబుల్ సత్తాధారులు, డబుల్ కిరీటధారులైన శ్రేష్ఠ ఆత్మలకు, సదా సర్వశక్తుల ద్వారా శక్తి స్వరూపం యొక్క ప్రత్యక్ష స్వరూపాన్ని చూపించే శక్తిశాలి ఆత్మలకు, సదా లక్ష్యమును లక్షణాల రూపంలో చూపించే, అనుభవం చేయించే శక్తిశాలి మహావీరులైన, అచలమైన, స్థిరమైన ఆత్మలకు బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- దృఢ సంకల్పము ద్వారా వ్యర్థము అనే రోగాన్ని సదా కొరకు సమాప్తము చేసే సఫలతామూర్త భవ

సఫలతామూర్తులుగా అయ్యేందుకు పిల్లలందరూ ఇదే దృఢ సంకల్పము చెయ్యాలి - ఎప్పుడూ వ్యర్థాన్ని ఆలోచించము, ఎప్పుడూ వ్యర్థాన్ని చూడము, వ్యర్థాన్ని వినము, వ్యర్థాన్ని మాట్లాడము మరియు వ్యర్థాన్ని చెయ్యము.. సదా అప్రమత్తంగా ఉంటూ వ్యర్థం యొక్క నామ-రూపాలను కూడా సమాప్తము చేయండి. ఈ వ్యర్థము అనే రోగము చాలా కఠినమైనది, అది యోగీగా అవ్వనివ్వదు ఎందుకంటే వ్యర్థము విస్తారమైనది, విస్తారములో భ్రమిస్తున్న బుద్ధిని ఇముడ్చుకునే శక్తి ద్వారా సార రూపంలో స్థితి చేయండి, అప్పుడు సహజయోగులుగా, సఫలతామూర్తులుగా అవుతారు.

స్లోగన్:- ఇతరులకు చెప్పి నేర్పించేందుకు బదులుగా స్వయం చేసి నేర్పించేవారిగా అవ్వండి.

సూచన:- ఈరోజు నెలలోని మూడవ ఆదివారము, రాజయోగి తపస్వీ సోదరీ-సోదరులందరూ సాయంత్రం 6.30 నుండి 7.30 గం. వరకు విశేషంగా యోగాభ్యాస సమయంలో ఇలా అనుభవం చేయండి - ఆత్మనైన నేను భృకుటి ఆసనంపై విరాజమానమైన ఒక చైతన్య దీపాన్ని, నేను అజ్ఞానమనే అంధకారాన్ని దూరం చేసి జ్ఞాన ప్రకాశాన్ని వ్యాపింపజేసి విశ్వాన్ని ప్రకాశవంతంగా చేసే నిమిత్త బ్రాహ్మణ కులదీపాన్ని.